సాక్షి నల్లగొండ
శనివారం । 25 । మే । 2024



నకిలీ ఫేస్‌బుక్ ఖాతా
నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచారు. - 8లో



ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. - 8లో

గరిష్టం / కనిష్టం
42° / 27°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జూన్ 19న డాక్ అదాలత్

రామగిరి(నల్లగొండ) : హైదరాబాద్ చీఫ్ పోస్టాఫీస్‌లో జూన్ 19న ఆన్‌లైన్ ద్వారా జాతీయ డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నల్లగొండ పోస్టల్ సూపరింటెండెంట్ కె.రఘునాథ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ సర్వీసులకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే.. పోస్టల్ కవరుపై డాక్ అదాలత్ అని రాసి చీఫ్ పోస్టల్ మేనేజర్ ఎస్.రంగారావు, హైదరాబాద్ 500001 అడ్రస్‌కు జూన్ 7వ తేదీలోపు చేరేలా పంపాలని పేర్కొన్నారు.

నేరెడుగొమ్ము ఎంపీపీగా బిక్కునాయక్ ఎన్నిక

చందంపేట : నేరెడుగొమ్ము మండల ఎంపీపీగా వాంకుడావత్ బిక్కునాయక్ ఎన్నికయ్యారు. గతంలో ఇక్కడ ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో.. నూతన ఎంపీపీ వైస్ ఎంపీపీల ఎన్నికను శుక్రవారం నేరెడుగొమ్ము ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారి డీఎల్‌పీఓ రామ్మోహన్‌రావు సమక్షంలో నిర్వహించిన ఎన్నికలో కాచరాజుపల్లి ఎంపీటీసీ సభ్యుడు వాంకుడావత్ బిక్కునాయక్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీగా పేర్వాల ఎంపీటీసీ ఇస్లావత్ సరోజను ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో వారికి అధికారులు ఎన్నిక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీటీసీలు యుగేందర్‌రెడ్డి, రమేష్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాన్‌యాదవ్, జెడ్పీటీసీ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్లు జాలె నర్సింహారెడ్డి, శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య, నాయకులు పాపానాయక్, హరికృష్ణ, రమేష్, సుభాష్, భస్వారెడ్డి, కొండల్‌రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ ఎంపీపీగా రాజమణి


ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రాజమణి

మర్రిగూడ : ఎంపీపీగా తిరగండ్లపల్లి ఎంపీటీసీ గండికోట రాజమణిహరికృష్ణ ఎన్నికయ్యారు. డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్నికకు మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను ఏడుగురు హాజరయ్యారు. ఎంపీపీగా రాజమణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సీఈఓ ఆమెకు నియామకపత్రం అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. గత ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నూతన ఎంపీపీ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ చినమునయ్య, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు తుమ్మల వరప్రసాద్, ఏర్పుల శ్రీశైలం, వెన్నమనేని శోభారవీందర్‌రావు, దాసరి మమతగోపాల్ పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీపీని సన్మానించారు. కార్యక్రమంలో వెన్నమనేని రవీందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, ముద్దం నరసింహాగౌడ్, జంగిలి రవి, రాములుగౌడ్ ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

నల్లగొండ : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 3,012 మంది విద్యార్థులకుగాను 2,800 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 1,168 మందికిగాను 1,062 మంది హాజరయ్యారు.

తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు

నల్లగొండ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఇండియా కూటమిలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన తీన్మార్ మల్లన్నకు మద్దతునిస్తున్నామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓడించాలన్నారు. తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, మల్లేష్, ప్రభావతి, తుమ్మల పద్మ, దండెంపల్లి సత్తయ్య, మంగారెడ్డి, వెంకటేశ్వర్లు, టి.రామ్మూర్తి పాల్గొన్నారు.

నకిలీలకు అడ్డుకట్ట

రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అప్రమత్తం
- పత్తి విత్తనాలపై అవగాహన కార్యక్రమాలు
- ఏఈఓ పరిధిలోని అన్ని గ్రామాల్లో సమావేశాల నిర్వహణ
- విత్తనాల అమ్మకంపై నిరంతరం నిఘా


నల్లగొండ మండలం అప్పాజిపేటలో రైతులకు పత్తి విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల బెడదను అరికట్టేలా వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టింది. రైతులతో సమావేశాలను ఏర్పాటు చేసి పత్తి విత్తనాలపై అవగాహన కల్పిస్తోంది. జిల్లాలోని 140 వ్యవసాయ క్లస్టర్లలోని వ్యవసాయ విస్తరణాధికారులు తమ పరిధిలోని 5 నుంచి 7 గ్రామాల్లో రోజూ రెండు నుంచి మూడు గ్రామాల చొప్పున రైతులతో సమావేశాలను నిర్వహించనున్నారు. గ్రామంలోని కూడళ్లలో కూర్చున్న రైతులతో ఏఈఓలు మమేకమై పత్తి సాగుపై చర్చించి విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించనున్నారు. ఆయా ఏఈఓల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలు పూర్తిచేసేలా జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించింది.

దుకాణాల్లో తనిఖీలు..
గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు నకిలీతోపాటు లూజ్ విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశాక దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ శాఖ ప్రస్తుత సీజన్‌లో వాటిని అరికట్టేలా ముందస్తుగానే చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని విత్తనాలు దుకాణాల్లో తనిఖీలు చేయడంతోపాటు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని విత్తనాల దుకాణాదారులతో సమావేశం ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, బ్రాండెండ్ కంపెనీల, నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదేశించింది.

ఈ అంశాలపై రైతులకు అవగాహన
నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండడంతో పాటు నాణ్యమైన విత్తనాల ఎంపిక, బార్‌కోడ్ ఉందా లేదా అనేది పరిశీలించడం, కంపెనీ పేరు, ప్యాకింగ్ తేదీ, గడువు ముగిసే తేదీ పరిశీలించడంతో పాటు ఎమ్మార్పీని పరిశీలించాల్సి ఉంటుంది. కొనుగోలు చేసి పత్తి ప్యాకెట్లకు విధిగా రశీదులను తీసుకోవాలని, రశీదును సీజన్‌ముగిసే వరకు భద్రపర్చుకోవాలని సూచించనున్నారు. లూజ్ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దని, లూజ్ విత్తనాలు అమ్మేవారి సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు. వీటితోపాటు పత్తి పంట సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను వివరిస్తున్నారు.


ప్రతి రోజూ వివరాల సేకరణ..
పత్తి విత్తనాల దుకాణాల్లో రోజు వారీగా విక్రయించే ప్యాకెట్ల వివరాలు, విత్తనాల స్టాక్ తదితర విషయాలు తెలుసుకునేందుకు ఏఈఓలు దుకాణాలను సందర్శించి ఏరోజుకారోజు జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. దీంతో నకిలీ, లూజ్ విత్తనాలను అరికట్టవచ్చని వ్యవసాయశాఖ భావిస్తోంది. ఈ అవగాహన కార్యక్రమాలను మండలస్థాయిలో ఏఓలు, జిల్లా స్థాయిలో జిల్లా వ్యవసాయాధికారి పర్యవేక్షించనున్నారు.

రైతులకు ఎంతో మేలు



సీజన్‌కు ముందుగానే పత్తి విత్తనాలపై అవగాహన కల్పించడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. వ్యాపారులు చెప్పిన విధంగా కాకుండా రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుంటారు. రైతులను చైతన్యం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం.
– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

విత్తనాలు బ్లాక్‌చేసి దందా..



ఎక్కువ ధరకు అమ్ముతున్న విత్తనాల ప్యాకెట్

మునుగోడు : మునుగోడులోని పలువురు ఫర్టిలైజర్ యజమానులు డిమాండ్ కలిగిన పత్తి విత్తనాలను బ్లాక్‌చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిసింది. ఆ విత్తనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.864 విక్రయించకుండా.. రూ.1200 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే ఆ విత్తనాలు అసలు దొరకడం లేదని.. తామే ఒక్కో ప్యాకెట్‌కు అదనంగా రూ.100 నుంచి రూ.150 చెల్లించి కంపెనీ వద్ద కొనుగోలు చేస్తున్నామని వ్యాపారులు చెబుతారని రైతులు అంటున్నారు. రైతులు ఎవరైనా గట్టిగా అడిగితే ఆ కంపెనీ విత్తనాలు 5 ప్యాకెట్లు కొనుగోలు చేస్తే ఇతర కంపెనీలకు చెందిన మరో 10 ప్యాకెట్లు కొనాలని నిబంధన పెట్టి విక్రయిస్తున్నారని చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేక వ్యాపారి చెప్పిన ధరకే విత్తనాలు కొనుగోలు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు.

అధిక దిగుబడి వస్తుందని ప్రచారం..
ఓ కంపెనీకి చెందిన విత్తనాలు అధిక దిగుబడి వస్తుందని రెండేళ్లుగా ప్రచారం జరుగుతోంది. ఆ విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది రైతులు ఫర్టిలైజర్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కానీ ఆ విత్తనాల కంపెనీ మునుగోడులోని ఇద్దరు దుకాణాదారులకు డీలర్ షిప్ ఇచ్చినా.. వారిలో ఒక్కరికే విత్తనాలను సరఫరా చేస్తోంది. మునుగోడులో దాదాపు 30కిపైగా ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి. అయితే డీలర్‌షిప్ కలిగిన వ్యాపారులకు.. ఇతర దుకాణాదారులు సీజన్ ప్రారంభానికి రెండు, మూడు నెలల ముందే అడ్వాన్స్‌గా రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించి ఆ కంపెనీ విత్తనాలు సరఫరా చేయాలని ఒప్పందం చేసుకున్నారు. ఇప్పుడు ఆ విత్తనాలకు డిమాండ్ పెరగడంతో ఆ వ్యాపారులకు కూడా సరఫరా చేయకుండా డీలర్‌షిప్ కలిగిన వ్యాపారే అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. అంతే కాకుండా నల్లగొండ జిల్లాకు కంపెనీ కేటాయించిన విత్తనాలు ఇక్కడే విక్రయించకుండా ఇతర జిల్లాకు కూడా సరఫరా చేసి దందా కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. విత్తనాల అమ్మకాల విషయంలో ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని డిమాండ్ కలిగిన విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించేలా చూడాలని కోరుతున్నారు.

తప్పలకు ఆస్కారం ఉండొద్దు

- పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన


మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : వరంగల్– ఖమ్మం –నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండొద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, ఉప ఎన్నిక రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున బ్యాలెట్ పేపర్ ఎలా మడత పెట్టాలో తెసుకోవాలని సూచించారు. 800 పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 2 బ్యాలెట్ బాక్సులు ఇస్తామని తెలిపారు. ఇటీవలే పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించినందున.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల ఎడమ చేయి మధ్య వేలికి సిరా గుర్తు పెట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం సరఫరా చేసిన వాయిలెట్ స్కెచ్ పెన్ ద్వారా మాత్రమే ఓటర్లు ఓటు వేయాలన్నారు. ఓటు వేసిన తర్వాత ఎవరైనా ఫొటో తీస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ప్రిసైడింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవోలు, మాస్టర్ ట్రైనర్ బాలు పాల్గొన్నారు.

సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

వరంగల్– ఖమ్మం– నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ సిబ్బందికి భోజనం, బ్యాలెట్ బాక్సుల తరలింపునకు వాహనాలు తదితర విషయాలపై దృష్టి సారించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పట్టభద్రుల ఉప ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జ సమక్షంలో ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శాసనమండలి ఉప ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ అన్ని 12 జిల్లాల నుంచి నిర్దేశించిన సమయంలో నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రానికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు తీరు బాగుంది

- సెంట్రల్ సెక్రటేరియట్ శిక్షణ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

నల్లగొండ : జిల్లాలో వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరు బాగుందని కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ సెక్రటేరియట్ శిక్షణ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మరి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ నిమిత్తం వచ్చిన ఈ బృందం ఈనెల 20 నుంచి 24 వరకు జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్రతో సమావేశమై వారు అధ్యయనం చేసిన ప్రభుత్వ పథకాలపై అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా పలువురు శిక్షణ అధికారులు మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో అమలు చేస్తున్న మిషన్ భగీరథ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వైద్య సదుపాయాలు, సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశాన వాటికలు, నర్సరీలు, ధాన్యం సేకరణ తదితర పథకాలు బాగున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, శిక్షణ నిర్వాహకులు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

రామగిరి(నల్లగొండ) : పాలిసెట్ – 2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం నల్లగొండలోని 9 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3,842 మంది విద్యార్థులను కేటాయించారు. వారిలో 1,924 మంది బాలురు, బాలికలు 1,437 పరీక్షకు హాజరయ్యారు. 481 మంది గైర్హాజరయ్యారు.


హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ బొజ్జ, పక్కన కలెక్టర్ హరిచందన, అధికారులు


సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా ఉండాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పరిశీలకుడు రాహుల్ బొజ్జ

నల్లగొండ : పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ పరిశీలకులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని శాసనమండలి ఉపఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని జెడ్పీ మీటింగ్ హాల్లో శాసనమండలి ఉపఎన్నిక పోలింగ్ పై సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పోలింగ్ సమయంలో సూక్ష్మ పరిశీలకులు చేయాల్సిన విధులను, చేయకూడని పనులను తెలియజేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన మాట్లాడుతూ ఉప ఎన్నికల పోలింగ్‌లో భాగంగా ఏజెంట్ల హాజరు, బ్యాలెట్ బాక్స్‌ల సీలింగ్, ఓటరును గుర్తించే ప్రక్రియ, రహస్య ఓటింగ్ విధానాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి, డీఏఓ శ్రవణ్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, జిల్లా మీసేవ అధికారి రాజశేఖర్, మాస్టర్ ట్రైనర్స్ బాలు, గోపి పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ' ప్రచారానికి నేటితో తెర

- సాయంత్రం 4 గంటలకు ముగింపు
- తుది అంకానికి చేరిన ఎన్నికల ప్రక్రియ
- ప్రలోభాలకు సిద్ధమవుతున్న పార్టీలు



ఓటర్లు ఇలా..	
పురుషులు	2,88,189
మహిళలు	1,75,645
ట్రాన్స్‌జెండర్లు	5
మొత్తం	4,63,839

సాక్షి ప్రతినిధి నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరింది. ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన నాటి నుంచి ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఇక చివరి అంకమైన పోలింగ్ ఈనెల 27వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. దీంతో శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రచారానికి తెర పడనుంది. ఇప్పటి వరకు సభలు, సమావేశాలతో నిర్వహించగా.. ఇక ఓటర్లను ఆకర్షించేలా గిఫ్టులు, డబ్బు పంపిణీపై పార్టీలు దృష్టి పెట్టినట్లు తెలిసింది.

ఇంటింటి ప్రచారం కూడా..
జిల్లాలో 15 రోజులుగా అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఇంటింటికి, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. నేటి సాయంత్రం 4 గంటల నుంచి ఇంటింటి ప్రచారానికి కూడా తెరపడనుంది.

మద్యం దుకాణాలు బంద్
పోలింగ్ సందర్భంగా మద్యం దుకాణాలు కూడా మూత పడనున్నాయి. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఈ నెల 27వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు మద్యం షాపులు పూర్తిగా బంద్ కానున్నాయి. దీంతో మద్యం ప్రియులు ముందుగానే కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు.

బరిలో 52 మంది అభ్యర్థులు
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 52 మంది పోటీలో ఉన్నారు. దీంతో పెద్ద బ్యాలెట్ పేపర్లు ముద్రించారు. ఇందుకోసం జంబో బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తున్నారు. ముందు రోజే సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. ఇప్పటికే బీఎల్‌ఓలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి పోల్ చిట్టీలు అందజేస్తున్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 కొత్త జిల్లాల పరిధిలో పోలింగ్ జరగనుంది. 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నిబంధనలు పాటించాలి : ఎస్పీ

నల్లగొండ రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్పీ చందనాదీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, విలువైన వస్తువులు పంపిణీ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఈనెల 25 సాయంత్రం 4గంటలలోపు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాన్ని వదిలి వెళ్లిపోవాలని సూచించారు.

బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం : కలెక్టర్

నల్లగొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా నేటి సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ పరమైన బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ముగిసే 48 గంటల ముందు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపితే ఎన్నికల నిబంధనల మేరకు చట్టరీత్యా తగు చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ది మాటల ప్రభుత్వమే..

- వారొచ్చాకే తెలంగాణలో హత్యా రాజకీయాలు మొదలయ్యాయి
- టీఎస్‌ను టీజీగా మార్చడం తప్ప చేసిందేమీ లేదు
- పట్టభద్రులు విచక్షణతో ఓటు వేయాలి
- మాజీ మంత్రి కేటీఆర్


నకిరేకల్ : సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన జగదీష్‌రెడ్డి, లింగయ్య యాదవ్ తదితరులు

నకిరేకల్, దేవరకొండ: ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ది మాటల ప్రభుత్వమేనని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శుక్రవారం నకిరేకల్, దేవరకొండలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో వారొచ్చాకే హత్యా రాజకీయాలు మొదలయ్యాయని, గడిచిన ఆర్నెళ్లలో రెండు హత్యలు జరిగాయన్నారు. ఎన్నికల ముందు మార్పు తీసుకొస్తాం అని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు టీఎస్ నుంచి టీజీ, 24గంటల కరెంట్ నుంచి వచ్చిపోయే పరిస్థితి తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా పేదింటి ఆడ బిడ్డల పెండ్లికి రూ.లక్ష, తులం బంగారం ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఎంతమందికి ఇచ్చాడని ప్రశ్నించారు. తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వలేదన్నారు. ఆర్నెళ్ల కింద కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేశారా.. లేదా.. అన్నది ఒక్కసారి ఆలోచించి విచక్షణతో ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు. టెట్ ఫీజు ఐదు రెట్లు పెంచి నిరుద్యోగుల పొట్ట కొట్టారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి బ్లాక్‌మైలర్ అని.. అతనిపై 56 క్రిమినల్ కేసులు ఉన్నాయని వాటిలో అమ్మాయిలు పెట్టినవే 10 కేసులు ఉన్నాయన్నారు. అలాంటి వ్యక్తిని చట్టసభల్లోకి రానివ్వొద్దని కోరారు.

బీజేపీతో ఒరిగిందేమీ లేదు : గుంటకండ్ల
మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్ల కాలంలో బీజేపీతో దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఇక్కడే నోట మాట రాదని, ఆయనకు ఓటు వేసి గెలిపిస్తే ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదన్నారు. విదేశాల్లో స్థిర పడే అవకాశం వచ్చినా ఇక్కడి ప్రజల కోసం పని చేస్తున్న రాకేశ్‌రెడ్డికి కేసీఆర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని పట్టభద్రులంతా ఆలోచన చేసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా సమావేశాల్లో నల్లగొండ, యాదాద్రి జిల్లాల జెడ్పీ చైర్మన్లు బండ నరేందర్ రెడ్డి, సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరికిషోర్, గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు యాదవ్, నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, డాక్టర్ నలగాటి ప్రసన్నరాజ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, బలరాం, స్వర్ణలత, నాయకులు నేనావత్ కిషన్‌నాయక్, వడ్త్యా రమేష్‌నాయక్, సునితాజనార్దన్‌రావు, కంకణాల వెంకట్‌రెడ్డి, టివిఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కోదాడరూరల్ : గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన బొల్లెద్దు శ్రీకాంత్(42) భార్య, పిల్లలను వదిలేసి మరో మహిళతో సహజీవనం చేస్తూ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో మద్యం మత్తులో గురువారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా అతడితో కలిసుంటున్న మహిళ ఆటోలో చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చింది. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై భార్య జోజిరాణి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాఠశాలలో వంట సామగ్రి చోరీ

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామ జెడ్పీ హెచ్‌ఎస్‌లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులకు అందించే పుస్తకాలను భద్రపరిచేందుకు హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శుక్రవారం పాఠశాలకు వచ్చారు. ఆ సమయంలో పాఠశాలలోని వంటగది తాళం పగులగొట్టబడి ఉంది. అంతేకాకుండా ఆ వంట గదిలోని సుమారు రూ.50 వేల విలువ గల వంట సామగ్రి చోరీ కావడాన్ని ఉపాధ్యాయులు గుర్తించారు. చోరీకి పాల్పడిన నిందితులు బీర్లు తాగి సీసాలను గదిలోనే పడేశారు. దీంతో చోరీ జరిగిన విషయాన్ని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు హెచ్‌ఎం తెలియజేశారు. పాఠశాలను పరిశీలించిన అనంతరం చిట్యాల పోలీసులకు చోరీ ఘటనపై హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. కాగా పాఠశాల గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడం, వాచ్‌మెన్ లేకపోవడం, వేసవి సెలవుల కారణంగా పాఠశాల గేటు వేసి ఉండడంతో ఇదే అదునుగా భావించి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది.

ఎక్స్ వేదికగా ఫిర్యాదు

హాలియా : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట స్టేజీ వద్ద నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు నిలపకపోవడంతో మహిళలు పడుతున్న ఇబ్బందులపై ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన యువకుడు ఎండీ అంజాద్‌ఖాన్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కలెక్టర్ హరిచందనకు పోస్టు చేశారు. స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తక్షణమే సమస్యను పరిష్కరించాలని నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ ఆర్టీసీ బస్సు డిపో అధికారులను ఆదేశించారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

శాలిగౌరారం: అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని సీజ్ చేసి రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని గురుజాల గ్రామం వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన కమ్మంపాటి సోమన్న నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో 20 కిలోల విడి పత్తి విత్తనాలను తీసుకెళ్తుండగా పక్కా సమాచారంతో గురుజాల గ్రామ శివారులో సోమన్నను పట్టుకొని విత్తనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమన్నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నల్లగొండ కలెక్టర్ హరిచందన పేరుతో
నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

- ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తూ.. మెసెంజర్‌లో చాటింగ్
- మా ఫ్రెండ్ సీఆర్‌పీఎఫ్ ఆఫీసర్ ఇల్లు అమ్ముతారంటూ చాటింగ్
- మీకు తెలిసిన వారికి అమ్మించమంటూ మెసేజ్‌లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన పేరుతో ఫేస్‌బుక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ ఖాతా ఓపెన్ చేశారు. ప్రొఫైల్‌లో కలెక్టర్ హరిచందన ఫొటోతోపాటు బ్యాక్‌గ్రౌండ్‌లో గతంలో ఆమె చేసిన కార్యక్రమాలతో కూడిన ఫొటోలతో హరిచందన్ ఐఏఎస్ పేరుతో ఖాతాను రూపొందించి ఓపెన్ చేశారు. దీంతో కలెక్టర్‌కు తెలిసిన వారు ఎవరైనా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తే దానికి యాక్సెప్ట్ చేసి, ఆ ఖాతాలో ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వారికి హరిచందన ఐఏఎస్ పేరుతో కలిగిన ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతున్నారు. అది నిజమని భావించిన వారు యాక్సెప్ట్ చేయడంతో అసలు కథ అప్పుడు మొదలవుతోంది. ఫేస్‌బుక్ మెసేంజర్ ద్వారా చాటింగ్ మొదలు పెడుతున్నారు. తనకు సంతోష్‌కుమార్ అనే సీఆర్‌పీఎఫ్ ఆఫీసర్ ఫ్రెండ్ ఉన్నారని, ఆయనకు ట్రాన్స్‌ఫర్ అయిందని, తన ఇల్లును తక్కువ ధరకు అమ్ముతున్నారంటూ చాటింగ్ మొదలు పెడుతున్నారు. మీకు తెలిసిన వారికి విక్రయించి పెట్టమని, లేదంటే మీరే తీసుకోండని మాటల్లో పెట్టి, ఫోన్‌నెంబరు తీసుకొని మరొక నంబరుతో వాట్సాప్ ద్వారా చాటింగ్ చేస్తూ డబ్బులు లాగే ప్రయత్నం చేస్తున్నారు. మీరు ఇల్లు ఎలాగూ తీసుకుంటారని భావిస్తున్నానని, తాను ప్రస్తుతం మీటింగ్‌లో ఉన్నానని, అర్జంట్ అవసరం ఉందంటూ డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనను వివరణ కోరగా, తనకు ఫేస్‌బుక్ ఖాతా లేదని, అది ఫేక్ అకౌంట్ అయి ఉంటుందని, ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎవరు నమ్మిమోసపోవద్దని పేర్కొన్నారు.

జూన్ 1 నుంచి సురేంద్రపురిలో ఉత్సవాలు

భువనగిరి రూరల్ : మండల పరిధిలోని వడాయిగూడెం గ్రామ పంచాయతీ వద్ద గల సురేంద్రపురిలో జూన్ 1 నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ నర్సింహారావు తెలిపారు. శుక్రవారం సురేంద్రపురిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ చైర్మన్ కుందా ప్రతిభ, కంచి కామకోటి పీఠం ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 1న సువర్చల పంచముఖ హనుమాన్ కల్యాణం, హనుమాన్ మాల విరమణ, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం సురేంద్రపురి సృష్టికర్త కుందా సత్యనారాయణ విగ్రహ ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం స్వామివారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణ్ కుమార్ చార్యులు, మత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.


విశ్వరూప్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకులు


స్వామివారి జోడు సేవలో పాల్గొన్న ఆర్.కే.రోజా

యాదాద్రీశుడిని దర్శించుకున్న ఏపీ మంత్రులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు విశ్వరూప్, ఆర్‌కె రోజా వేర్వేరుగా దర్శించుకున్నారు. విశ్వరూప్ తన కుటుంబ సభ్యులతో కలిసి గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. యాదాద్రీశుడు తమ ఆరాధ్య దైవమని, ఆ స్వామి వారి అనుగ్రహంతోనే ఈ స్థాయిలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, మరో మంత్రి ఆర్‌కె రోజా స్వామివారి జోడు సేవలో పాల్గొన్నారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రోజాకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. అంతకు ముందు ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

- బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు
- '1'ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు
- అధికారి ఇచ్చిన పెన్నునే ఉపయోగించాలి
- ఈ నెల 27న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



నల్లగొండ: వరంగల్‌-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 27న జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ ఉప ఎన్నిక బ్యాలెట్ పేపర్ పద్ధతిన నిర్వహిస్తున్నారు. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర సాధారణ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో చాలా తేడా ఉంటుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసే క్రమంలో ఈవీఎంలను వాడతారు. ఆ ఎన్నికల్లో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ఉంటుంది. ఒకే అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అందుకు భిన్నంగా ఉంటాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే అవకాశం ఓటర్లకు ఉంటుంది.

ప్రాధాన్యత క్రమంలోనే ఓటు..

- ప్రతి ఓటరు బరిలో ఉన్న మొత్తం అభ్యర్థుల్లో ఒక్కరికి లేదా కొందరికి లేదా అందరికీ ఓటేయవచ్చు.
- కేవలం అంకెలు మాత్రమే ఆ బాక్సులో ప్రాధాన్యత క్రమంలో వేయాల్సి ఉంటుంది.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుంది.
- ఏ వ్యక్తికైతే మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తారో ఆ వ్యక్తి బ్యాలెట్ పేపర్ వరుసలో ఏ నంబర్‌లో ఉన్నా కూడా.. బాక్సులో 1 అనే అంకె వేయాల్సి ఉంటుంది.
- 1, 2, 3, 4, 5 ఇలా ప్రాధాన్యత క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయాలి.

కేవలం ఒక్కరికి కూడా ఓటేయొచ్చు

- పోటీలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా అందులో 40వ సీరియల్ నంబర్‌లో ఉన్న అభ్యర్థికి ఒక్కరికే ఓటు వేయాలంటే అతడికి ఎదురుగా ఉన్న బాక్సులో 1 అని ఓటు వేసి మిగతా వారికి వేయకున్నా ఆ ఓటు చెల్లుతుంది.
- 1వ నంబర్ ప్రాధాన్యత ఓటు వేయకుండా 2, 3, 4 నంబర్లతో ఓట్లేస్తే ఆ ఓటు చెల్లదు.
- తప్పనిసరిగా 1 నుంచి సీరియల్‌గా మాత్రమే ఓటు వేయాలి.
- ఒక అభ్యర్థికి ఒక అంకెను మాత్రమే వేయాలి.
- అంకెలను తెలుగులో కానీ, ఇంగ్లిష్‌లో, ఇతర భాషాల్లో వన్, టు, త్రీ అని పదాలు, అక్షరాల్లో రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకాలు చేయకూడదు.
- వేలిముద్ర వేయకూడదు.
- అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో రైట్ గుర్తు, ఇంటు గుర్తు పెట్టకూడదు.

ఓటు వేసే విధానం..

- ప్రతి అభ్యర్థికి ఎదురుగా పార్టీ పేరు లేదా స్వతంత్ర అభ్యర్థి అని రాసి ఉంటుంది.
- పార్టీల గుర్తులు ఉండవు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్ ఉంటుంది.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే ఓటరు తన ఓటు వేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్‌లో పెన్నుతో కేవలం నంబర్ మాత్రమే వేయాల్సి ఉంటుంది.

సొంత పెన్నుతో ఓటు వేయవద్దు..

- బ్యాలెట్‌లో ఓటర్ ఓటు వేసేటప్పుడు సొంత పెన్నుతో ఓటు వేయరాదు.
- అలా వేస్తే ఓటు చెల్లదు.
- ఒకరికి ఇచ్చిన ప్రాధాన్యత ఓటు మరో అభ్యర్థికి ఇచ్చినా ఆ ఓటు చెల్లదు.
- ఒకరికి 1వ నంబర్ వేసి దాన్ని పదేపదే దిద్దినా ఆ ఓటు మురిగిపోతుంది.
- బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేయకుండా తీసుకెళ్తే కేసు నమోదు చేస్తారు.
- బాక్సు మధ్యలో మాత్రమే నంబర్ రాయాల్సి ఉంటుంది.
- రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఊదా రంగు స్కెచ్ పెన్నుతో గాక ఇతర ఏ పెన్నులతో రాసినా అది చెల్లుబాటు కాదు.
- ఏ అంకెలు వేయకుండా ఖాళీ బ్యాలెట్ పేపర్ ఇచ్చిన ఆ ఓటు చెల్లుబాటు కాదు.

మల్లన్న గెలుపులో యువజన కాంగ్రెస్ పాత్ర కీలకం

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి


మాట్లాడుతున్న శివసేనారెడ్డి

నల్లగొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల యువజన కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశానికి శివసేనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాటాడారు. కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న గెలిస్తే ఆ క్రెడిట్ యువజన కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌సింగ్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా రాకేష్, ఎండీ గౌస్, జిల్లా ఉపాధ్యక్షుడు జయంత్‌రెడ్డి, జహంగీర్ బాబా, పగడాల నాగరాజు, ఆజర్, హరికృష్ణ, జలంధర్‌రెడ్డి, గాలి నాగరాజు, కొప్పు నవీన్‌గౌడ్, కుసుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ : ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన హుజూర్‌నగర్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని మాగ్దుమ్‌నగర్‌కు చెందిన జడ నాగయ్య (45) ట్రాక్టర్‌తో స్థానిక పోతిరేని కుంట చెరువు నుంచి తన వ్యవసాయ పొలానికి మట్టి తోలుతున్నాడు. ఈ క్రమంలో మేరిగ గురవయ్య పొలం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నాగయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగయ్య చిన్న కుమారుడు జడ భానుప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీను (ఫైల్)

కొండమల్లేపల్లి : మండలంలోని పెండ్లిపాకల సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దవూర మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన పెరిక శ్రీను, చిలుముల కనకయ్య ఇరువురు కలిసి శుక్రవారం ఉదయం తమ స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై దేవరకొండలో ఎల్‌ఐసీ కార్యాలయానికి వెళ్లారు. పని ముగించుకొని తిరిగి ఉట్లపల్లికి వెళ్లే క్రమంలో కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు వద్ద కొండమల్లేపల్లి నుంచి అంగడిపేటకు వెళ్తున్న ఎలిమినేటి అనిల్ అనే యువకుడు వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో పెరిక శ్రీను తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కనకయ్యకు గాయాలయ్యాయి. అనిల్‌కు సాధారణ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అశ్విని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. 20మంది ఉపాధి కూలీలకు గాయాలు

అర్వపల్లి: ఉపాధి హామీ పథకం పనులకు కూలీలను తీసుకెళ్తున్న ఆటో బోల్తాపడి 20 మంది వరకు కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూలీలు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్సారెస్పీ కాలువలను ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా శుభ్రం చేయడానికి శుక్రవారం ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో కాలువ కట్టపై గుంత వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు కోడెబోయిన భాగ్యమ్మ, కోడెబోయిన రామనర్సమ్మ, గుడిపల్లి అరుణ, వేములకొండ రామనర్సమ్మ, ఎరగాని వెంకటమ్మ, వేములకొండ నాగమ్మ, పేరెల్లి లక్ష్మీనర్సమ్మ, అంబటి యాదమ్మ, ఇందుర్తి కమలమ్మ, చామకూరి పద్మ, చామకూరి లింగమ్మ, బొల్లం రాంబాయమ్మ, మద్ది ప్రమీల, ఇందుర్తి రంగనాయకమ్మ, జానమ్మ, కవిత, సైదమ్మతో పాటు మరికొందరు గాయపడ్డారు. వారిని వెంటనే అంబులెన్స్, మరో వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇళ్లకు చేరుకున్నారు.

49 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామంలో రేషన్ డీలర్లు అక్రమంగా నిల్వ ఉంచిన 49 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యం దందా జోరుగా జరుగుతోందనే పక్కా సమాచారంతో నకిరేకల్ సివిల్ సప్లయ్ డీటీ జ్యోతి, కేతేపల్లి ఎస్‌ఐ శివతేజతో కలిసి శుక్రవారం భీమారం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. రేషన్ డీలర్ చిముట కృష్ణయ్య లబ్ధిదారుల నుంచి సేకరించి దుకాణం పక్కనే ఉన్న ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 45 క్వింటాళ్లు, మరో రేషన్ డీలర్ ఎస్‌డీ.ఫాతిమా నిల్వ ఉంచిన 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని నకిరేకల్‌లోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌కు తరలించారు. ఇరువురు రేషన్ డీలర్లపై కేసు నమోదు చేశారని డీటీ సీఎస్ జ్యోతి తెలిపారు.

ఫ్లోరోసిస్ బాధితురాలి కోరిక నెరవేర్చిన ఐఏఎస్


సువర్ణ గీసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ బొమ్మ

కోదాడరూరల్ : ఫ్లోరోసిస్ బాధితురాలు సువర్ణ గీసిన బొమ్మ తనకు చేరాలని చివరి కోరికను నెరవేర్చారు ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్. మర్రిగూడ మండలం సాయిబండతండాకు చెందిన సువర్ణ.. ఇందిరాగాంధీ, ప్రధాని మోదీ, కేసీఆర్, రాహుల్‌గాంధీ, ఆనంద్‌మహీంద్రా వంటి అనేక మంది ప్రముఖుల చిత్రాలను గీసింది. ఆమె ప్రతిభను చూసి ఎన్‌ఆర్‌ఐ సుధీర్ ఆమెకు శిక్షణ ఇప్పించాడు. వాటిని వేలం వేయగా రూ.5లక్షల బహుమతులు కూడా వచ్చాయి. అయితే సువర్ణ గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె గీసిన స్మితాసబర్వాల్, పీవీ సింధు చిత్రాలను వారికి అందజేయాలని చనిపోయే ముందు చెప్పింది. ఆ విషయాన్ని జలగం సుధీర్ ట్వీట్ చేయగా స్పందించిన స్మితాసబర్వాల్ కోదాడలో ఉన్న చిత్రపటాన్ని తెప్పించుకొని తన కార్యాలయంలో పెట్టుకుందని సుధీర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

పటిక, బెల్లం పట్టివేత

కోదాడరూరల్ : అనుమతి లేకుండా ఏపీ నుంచి తెలంగాణలోకి తరలిస్తున్న నల్లబెల్లం, పటికను కోదాడ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ నుంచి తెలంగాణలోకి నిషేధిత నల్లబెల్లం, పటికను రాష్ట్రంలోకి కోదాడ మీదుగా వస్తుందనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. ఖమ్మం క్రాస్‌రోడ్‌లో శుక్రవారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి ఖమ్మం వైపు ఇద్దరు వ్యక్తులతో వస్తున్న బొలేరోను ఆపి తనిఖీ చేయగా అందులో 100 కేజీల నల్లబెల్లం, 600 కేజీల పటిక పట్టుబడినట్లు తెలిపారు. అదేవిధంగా అనంతగిరి మండలంలోని చనుపల్లి వద్ద ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బెల్లం, పటిక, బొలేరో, ద్విచక్రవాహనాన్ని సీజ్ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బంగారు గొలుసు అప్పగింత

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు పోగొట్టుకున్న బంగారు గొలుసును కొండపైన విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీఎఫ్ పోలీసులు గుర్తించి అప్పగించారు. భక్తులు, ఎస్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నిఖిల్ తన కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రీశుడి దర్శనానికి శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో వచ్చాడు. స్వామివారిని దర్శించుకుని బయటకు వచ్చిన తరువాత కుటుంబ సభ్యులతో కలిసి నిఖిల్ ఉత్తర మాడ వీధిలో కూర్చున్నాడు. ఈ సమయంలో నిఖిల్ తన మెడలో ఉన్న సుమారు తులం బంగారం గొలుసు ఎక్కడో పడిపోయిందని గుర్తించాడు. 3 గంటల సమయం వరకు బంగారు గొలుసు కోసం వెతికి కొండ కిందకు వెళ్లిపోయాడు. తిరిగి నిఖిల్ మరోసారి గొలుసు వెతికేందుకు వచ్చాడు. ఈ క్రమంలో ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ కె.సోమేష్‌కుమార్‌గౌడ్ బంగారు గొలుసును గుర్తించారు. వివరాలు తెలుసుకున్న అనంతరం బంగారు గొలుసును భక్తుడికి అప్పగించారు.

రైతులే విత్తనాలు తయారు చేసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ లింగయ్య

త్రిపురారం : రైతులు తమకు కావాల్సిన విత్తనాలను తమ పొలంలోనే తయారు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య సూచించారు. శుక్రవారం త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్‌లో వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వరి విత్తన మేళా నిర్వహించారు. యాదాద్రిభువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని రైతులకు వరి విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాల కోసం ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడి ఆర్థికంగా నష్టపోవద్దని అన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, ఉమ్మడి జిల్లాలోని రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫిర్యాదు

నకిరేకల్ : ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు, డ్రైవర్‌కు మధ్య వివాదం తలెత్తింది. దీంతో సదరు డ్రైవర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బస్సును నిలిపి గొడవ చేసిన ప్రయాణికులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి డిపో ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు బయలుదేరింది. హైదరాబాద్‌లోనే మహిళా ప్రయాణికులతో బస్సు నిండిపోయింది. మార్గమధ్యలో నకిరేకల్‌కు చేరుకున్నాక బస్సులోనుంచి కొంత మంది ప్రయాణికులు దిగిపోయారు. అందులో నలుగురు మహిళా ప్రయాణికులు బస్సును కొద్ది సేపు ఆపండి.. తమ బంధువులు వస్తున్నారని డ్రైవర్‌ను కోరారు. కొద్దిసేపు బస్సు ఆపినప్పటికీ వారు రాకపోవడంతో డ్రైవర్ బస్సును కదిలించడంతో డ్రైవర్‌తో మహిళా ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. డ్రైవర్‌కు ప్రయాణికులకు మధ్య గొడవ ముదరడంతో సదరు డ్రైవర్ బస్సును పోలీస్ స్టేషన్ దగ్గరకు తీసుకెళ్లి నిలిపివేశారు. విధి నిర్వహణకు ప్రయాణికులు ఆటంకం కలిగించారని ప్రయాణికులపై పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేశారు. అనంతరం డ్రైవర్‌కు, ప్రయాణికులకు పోలీసులు సర్దిచెప్పి పంపించడంతో సమస్య సద్దుమనిగింది.

యాత్రికులను మోసం చేసిన ట్రావెల్స్ యాజమాన్యం

- యాత్ర ముగియకుండానే బస్సును వదిలేసి పరారైన డ్రైవర్
- పోలీసుల సాయంతో స్వగ్రామానికి చేరుకున్న యాత్రికులు

రామగిరి(నల్లగొండ): విహార యాత్రకు వెళ్లిన ప్రయాణికులను ట్రావెల్స్ యాజమాన్యం మోసం చేసిన ఘటన తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన 70 మంది కలిసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సుల్లో ఒక్కో బస్సులో 35 మంది చొప్పున ఈ నెల 16వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాష్ట్రాల్లోని పర్యాటక ప్రాంతాలను చూసుకుంటూ గోవా వెళ్లి వచ్చేవిధంగా ఒప్పదం చేసుకొని బయలుదేరారు. కాగా వారి ఒప్పందం ప్రకారం కాకుండా ఒకరోజు ముందుగానే యాత్రికులు నిద్రిస్తున్న సమయంలో డ్రైవర్ బస్సును హైదరాబాద్ మీదుగా వారి స్వగ్రామానికి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. గమనించిన యాత్రికులు ఎక్కడికి వెళ్తున్నావంటూ డ్రైవర్‌ను నిలదీశారు. మీ యాత్ర ముగిసింది.. ఇంతకు మించి ఇతర ప్రాంతానికి తీసుకెళ్లడం కుదరదు, మీరు ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వడం కుదరదని చెప్పడంతో డ్రైవర్‌తో వారు వాగ్వాదానికి దిగారు. దీంతో సదరు బస్సు డ్రైవర్లు ఇద్దరు మహబూబ్‌నగర్ జిల్లా సమీపంలోని జడ్చర్ల వద్ద గురువారం అర్ధరాత్రి బస్సును వదిలి వెళ్లిపోయారు. ప్రయాణికులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఏర్పాటు చేసిన డ్రైవర్ సహకారంతో బస్సులో స్వగ్రామం మామిడాలకు చేరుకున్న యాత్రికులు ట్రావెల్స్ యాజమాన్యంపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

భువనగిరి క్రైమ్ : మండలంలోని పచ్చర్లబోడ్ తండాలో లింగునూ హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఏసీపీ రవికిరణ్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. పచ్చర్లబోడ్ తండాకు చెందిన లింగుకి, దేవిసింగ్‌కు మధ్య పాత కక్షలు ఉన్నాయి. కాగా గతంలో లింగుపై హత్య, దోపిడీ, దొంగతనం కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో లింగు తనను చంపుతాడనే అనుమానంతో జనవరి 11న లింగుని దేవిసింగ్ తన కోళ్లఫారంలోకి పిలిచి మద్యం తాపించి మైకంలో ఉన్న లింగు మెడపై కత్తితో నరికాడు. లింగు తిరగబడితే దాడిచేయడానికి పానుగోతు నరేష్‌ను గడ్డివాము చాటుకు కాపలాగా ఉంచాడు. దేవిసింగ్ రెండుసార్లు కత్తితో నరకడంతో లింగు చనిపోయాడు. అనంతరం శవాన్ని ప్లాస్టిక్ నల్ల పట్టాలో చుట్టి తాడుతో బిగించారు. రక్తం కనిపించకుండా చెరిపేశారు. దేవిసింగ్, నరేష్ ఇద్దరు కలిసి హీరో యాక్టివా వాహనంపై లింగు శవాన్ని వేసుకుని కిలో మీటర్ దూరంలో ఉన్న మూసీ కాలువలో వేశారు. లింగు సెల్‌ఫోన్ తీసుకుని ఉప్పల్ వద్ద చెరువులో పడవేశారు. అనంతరం తండాకు చేరుకున్నారు. పోలీసులు అనుమానంతో ప్రశ్నించగా నిందితులు హత్య చేశామని ఒప్పుకున్నారు. శవాన్ని పడేసిన ప్రదేశాన్ని చూపించారు. కాగా శవం పూర్తిగా కుళ్లిపోయి ఉన్నది. పంచనామా నిర్వహించిన అనంతరం గ్రామంలో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.